## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కేతేపల్లి:** మండలంలోని కొప్పోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33/11 కేవీ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియేల్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పలపహాడ్, కొప్పోలు, భీమారం గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచిసాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఓంకారం

**చండూరు :** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉడతలపల్లి గ్రామానికి చెందిన కొరిమి ఓంకారం, చండూరు పట్టణ అధ్యక్షుడిగా అంగడిపేటకు చెందిన అనంత చంద్రశేఖర్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ నియమించారు. వారికి సోమవారం హైదరాబాద్‌లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నియామకపత్రాలు అందజేశారు.

### భగవద్గీత ప్రచారం

**నాంపల్లి:** మండలంలోని తుంగపహడ్ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సమాజంలో ధర్మాన్ని కాపాడడం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని కోరారు. కార్యక్రమంలో మేకల శ్రీనివాసులు, చంద్రమౌళి, చక్రధర్, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**మర్రిగూడ:** మండల కేంద్రానికి చెందిన గ్యార రాములు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు పానుగోటి అంజన్ రావు సోమవారం రాములును పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

### బీజేపీ ఉపాధ్యక్షుడిగా వేణు

**మునుగోడు:** మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన దర్శనం వేణుకుమార్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి సోమవారం వేణుకుమార్‌కు నియామక పత్రం అందజేశారు. వేణుకుమార్ గతంలో రెండుమార్లు జిల్లా కార్యదర్శిగా, వివిధ హోదాల్లో పనిచేశారు.

### ‘ఉప ముఖ్యమంత్రికి అవమానం విచారకరం’

**నార్కట్‌పల్లి :** యాదగిరిగుట్టపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆలయ అధికారులు అవమానపరచడం విచారకరమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

### రెస్టారెంట్ల యజమానులపై కేసులు

**నల్లగొండ:** పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో సోమవారం సివిల్ సప్లయీస్ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పలు హోటళ్లలో వినియోగిస్తున్న 40 సబ్సిడీ సిలిండర్లను సీజ్ చేశారు. వాటిని వినియోగిస్తున్న యజమానులపై 6ఏ చట్టం కింద కేసులు నమోదు చేశారు.

### పూరి గుడిసె దగ్ధం

**చండూరు :** ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన చండూరు మండలంలోని కస్తాల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కస్తాల గ్రామానికి చెందిన భూతం వెంకటేశం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మూడు అర్రల పూరి గుడిసె ఉంది. దంపతులు రోజూ మాదిరిగా కూలి పనులకు వెళ్లారు. 11గంటల సమయంలో ఇంట్లో నుంచి మంటలు వచ్చి గుడిసె పూర్తిగా కాలిపోయింది. గుడిసెలోని బియ్యం, నగదు, బంగారు ఆభరణాలు పూర్తిగా మంటల్లో కాలి బూడిదయ్యాయి. సుమారుగా రూ. 7లక్షలకు పైగా నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

### మహిళా దినోత్సవం

**కేతేపల్లి:** ప్రగతి మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షురాలు ఎ.నిర్మల, కార్యదర్శి ఎ.ఉమ, కోశాధికారి జి.మరియ పాల్గొన్నారు.

### మునుగోడులో చోరీ

**మునుగోడు:** మండల కేంద్రానికి సమీపంలోని వాగు వంతెన వద్ద గల వాటర్ సర్వీస్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్.ఐ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద వాగు వంతెనకు ఆనుకుని ఉన్న కర్నాటి స్వామి వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి చొరబడి అందులోని నగదుతో పాటు రెండు గ్యాస్ సిలిండర్లు, ఒక మానిటర్, మొత్తం దాదాపు రూ. 45వేల విలుగల వస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

# నీరు లేక ఎండుతున్న పొలాలు


గుండ్రాంపల్లిలో నీరు లేక ఎండిపోతున్న వరి పొలం


గుండ్రాంపల్లిలో పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పోస్తున్న రైతు

- భారీగా తగ్గిన భూగర్భ జలాలు
- వరిచేలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్న రైతులు
- పశువులను మేపుతున్న మరికొందరు..
- పంట నష్ట పరిహారం అందించాలని వేడుకోలు

**చిట్యాల:** యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి చేలకు నీరందక తీవ్ర పంట నష్టం వాట్లిలే పరిస్థితులు నెలకొన్నాయి. చిట్యాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో యాసంగి సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోవడంతో వరి చేలకు సరిపడా నీరు అందడం లేదు. వ్యవసాయ బోర్ల ద్వారా సరిపడా నీరు అందకపోవడంతో వందలాది ఎకరాల్లోని వరి చేలు ఎండిపోతున్నాయి.

**ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..**

ప్రస్తుతం చిట్యాల మండల పరిధిలో 14 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. కాగా గత నెలన్నర రోజులుగా వ్యవసాయ బోర్లలో నీరు తగ్గిపోవడంతో వరి చేలకు పూర్తిస్థాయి నీరు అందడం లేదు. సాగు చేసిన వరి పంటలో సగానికి పైగా రైతుల కళ్ల ఎదుటే ఎండిపోతోంది. కొందరు రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి నీటి కోసం కొత్తగా బోర్లు వేస్తున్నప్పటికీ రైతుల అవసరాల మేరకు బోర్లు పడడం లేదు. మరికొంత మంది రైతులు వరి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్థికంగా లేని రైతులు మాత్రం ఎండిన వరి పంటలను పశువులకు, జీవాలకు మేపుతున్నారు. మండలంలోని చిన్నకాపర్తి, పెద్దకాపర్తి, వనిపాకల, నేరడ, గుండ్రాంపల్లి గ్రామాలు, చిట్యాల మున్సిపాలిటీలోని వెంకటాపురం, శివనేనిగూడెంలలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా వేసిన పంటల్లో రెండు నుంచి మూడు వేల ఎకరాల్లో వరి చేలు ఎండిపోయి నష్టపోయే పరిస్థితి ఉంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించి పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

**వరి పొలం ఎండిపోయింది**



గుండ్రాంపల్లి గ్రామంలో నాకున్న ఆరేకరాల పోలంలో వరిపంటను సాగు చేస్తున్నాను. కాని గత నెలరోజులుగా వరి పంటకు బోర్లు ద్వారా నీరు సక్రమంగా సరఫరా కావటం లేదు. దీంతో ఇప్పట్టికే ఇరవై ఐదు శాతం వరకు వరి పొలం నీరు లేక ఎండిపోయింది. దీంతో చేతికి వచ్చిన వరి పంటను కాపాడుకునేందుకుగాను రోజుకు పద్దేనిమిది ట్యాంకర్‌ల నీటితో వరి పోలానికి సరఫరా చేస్తున్నాను.

–ప్రైశ్ర యాదిరెడ్డి, రైతు, గుండ్రాంపల్లి

# ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


కట్టంగూర్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

**కట్టంగూర్:** ప్రజారోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కట్టంగూర్, ముత్యాలమ్మగూడెం, ఇస్మాయిల్‌పల్లి, పందెనపల్లి, ఈదులూరు, పరడ, మునుకుంట్ల, బొల్లేపల్లి, అయిటిపాముల గ్రామాల్లో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. త్వరలోనే నకిరేకల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కొండల్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎల్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, మాజీ ఎంపీపీలు రెడ్డిపల్లి వెంకటమ్మసాగర్, కొండ లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, ఎంపీటీసీ వల్లపు నాగలక్ష్మిశ్రీనివాస రెడ్డి, కక్కిరేణి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ప్రాథమిక వైద్యాధికారి శ్వేత, పీఆర్, మిషన్ భగీరథ ఏఈలు జమీలుద్దీన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధే ధ్యేయం**

**నకిరేకల్:** గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం కడపర్తి, మంగళపల్లి, చందుపట్ల, మర్రూర్, గోరెంకలపల్లి, తాటికల్, వల్లాభాపురం, పాలెం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. కోటి వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు సోమవారం రాత్రి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు వీరార్జున్‌రెడ్డి, గాదగోని శ్రీలతకొండయ్య, ఇమడపాక లక్ష్మి, నాయకులు నకిరేకంటి ఏసుపాదం పాల్గొన్నారు.

**వసతుల కల్పనకు ప్రాధాన్యం**

**చిట్యాల:** మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చిట్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన చెత్తను తరలించే ట్రాలీ ఆటో, నీటి సరఫరా ట్యాంకర్‌ను సోమవారం ఆయన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, జడల పూలమ్మ చినమల్లయ్య, జిట్ట పద్మ బోందయ్య, జమాండ్ల జయమ్మ శ్రీనివాస్‌రెడ్డి, రెముడాల లింగస్వామి, సిలివేరు మౌనిక శేఖర్, కో ఆప్షన్ సభ్యుడు పాటి మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఎద్దులపురి కృష్ణ, ఎస్‌కె.ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### చేనేత నిల్వలను కొనుగోలు చేయాలి

**నల్లగొండ టౌన్ :** చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వమే కొనుగోలు చేసి కార్మికులకు పని కల్పించాలని కోరుతూ తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళిధర్ సోమవారం కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత ప్రధాన వృత్తి చేనేత అని ప్రస్తుతం ఆ వృత్తి సంక్షోభంలో పడి కార్మికులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత మిత్ర నగదును పెంచి అమలు చేయాలని కోరారు. చేనేత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కందగట్ల గణేష్, సింగం శివయ్య, చెరుకు సైదులు, మిర్యాల అశోక్, గంజి నాగరాజు, కర్నాటి శ్రీరంగం, గడ్డం దశరథ, ఏల శ్రీనివాస్, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**వడ్డీతో సహా చెల్లించాలి**

గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన గొర్రెల సహకార యూనియన్ సభ్యులకు వడ్డీతో సహా డబ్బులు తిరిగి చెల్లించాలని కోరుతూ అఖిల భారత విప్లవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నరసింహ సోమవారం కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. గుర్రంపోడు మండలం తేరటిగూడెం సొసైటీ సభ్యులు 9 నెలల క్రితం గొర్రెల కోసం అప్పులు చేసి డీడీలు కట్టారని తెలిపారు.

**కలెక్టర్‌కు వినతి**

సదరం సర్టిఫికెట్‌లలో బోగస్‌లను గుర్తించి అనర్హులను తొలగించాలని కోరుతు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ హరిచందనకు కట్ట ప్రసాద్, చందుపట్ల పరమేష్ వినతి పత్రం అందజేశారు. సదరం క్యాంప్‌నకు సర్టిఫికెట్ కోసం వచ్చే అమాయక దివ్యాంగుల వద్ద రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు అధికారులు, రాజకీయ నాయకులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకుని అర్హులకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట సైదులు, శంకర్, రమేష్, మోహన్, జానిలు ఉన్నారు.

# పేద రైతులకు పట్టాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

**మర్రిగూడ:** మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలోని నిరుపేద రైతులకు ప్రభుత్వం సీలింగ్ పట్టాలు ఇచ్చినప్పటికీ 2014లో తొలగించారని, తిరిగి రైతులకు ఆ పట్టాలు అందించాలని సీపీఐ నాయకులు సోమవారం గ్రామ రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి పాల్గొని మాట్లాడుతూ నిరుపేద రైతులు ఆ భూములపై ఆధారపడి గొర్రెల పెంపకం, పశువులకు గ్రాసం, వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించారని అన్నారు. రికార్డులను పరిశీలించి పట్టా పాస్ బుక్కులు అందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బూడిద సురేష్, ఇస్కిల్ల మహేందర్, మేతరి యాదయ్య, యాదగిరి, శ్రీశైలం, మునుకుంట్ల గిరి, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

**తహసీల్దార్‌కు వినతి**

మర్రిగూడ మండల కేంద్రంలోని ఖబరస్తాన్, ఈద్గాకు వెళ్లే దారిని సమీప రైతులు కబ్జా చేశారని, ఆ దారిని కాపాడాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు కోఆప్షన్ మెంబర్ యాకుబ్‌అలీ వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వేయర్‌తో సర్వే చేయించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి, మాస చంద్రశేఖర్, వెంకటంపేట బాలయ్య, పర్వతగిరి నర్సింహ, సలీం, నర్సింహ ఉన్నారు.

# పార్కుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్:** పట్టణంలోని పార్కుల్లో కనీస మౌలిక వసతులు సమకూర్చి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నీలగిరి పట్టణంలోని 34వ వార్డు వెంకటేశ్వర కాలనీలో పార్కు చుట్టూ రూ.20 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి చైర్మన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్కులో పిల్లలు ఆడుకునేలా ఆట సామగ్రి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రావిరాల పూజితవెంకటేశ్వర్లు, బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, నూకల జైపాల్‌రెడ్డి, కత్తుల షణ్ముఖ, బత్తిని వెంకటేశ్వర్లు, గార్లపాటి వెంకటయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత**

**రామగిరి(నల్లగొండ):** జిల్లా గ్రంథాలయం, ఎన్జీ కళాశాలకు సోమవారం కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, ఎన్జీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మునీర్, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ కృష్ణకొండిన్య, భాగ్యలక్ష్మి, వెల్దండి శ్రీధర్ పాల్గొన్నారు.

# గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

**చండూరు:** గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. సోమవారం మండల పరిధిలోని చామలపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రక్తహీనత ఉన్న చిన్నారులకు బలమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రియ, దయానంద్, సరోజ, రజిని, హేమావతి, లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**చిట్యాల:** పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని మహాత్మా గాంధీ గుడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు వివిధ రకాల పోషకాహార పదార్థాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ కవిత మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు, యువతులు పోషకాహారం తీసుకోవడం ద్వారా అనీమియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రోజా, పారిజాత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు


పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

**శాలిగౌరారం:** మండలంలోని భైరవునిబండ గ్రామంలో గంగాభవాని సమేత శ్రీఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. చివరిరోజు ఎడ్లబండ్లు, వాహనాల ప్రదక్షిణ ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో ఉమామహేశ్వరుడిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పవిత్రంగా భావించే బావినుంచి నీటిని తీసుకొని తాగడంతో పాటూ ఇంటికి తీసుకెళ్లేందుకు భక్తులు తీవ్ర పోటీపడ్డారు. స్థానిక ఎంపీటీసీ కొత్త శంకర్ రెడ్డి సొంత ఖర్చులతో భక్తులకు ప్యూరిఫైడ్ తాగు నీటిని అందించారు.

**ఎడ్లబండ్ల ప్రదక్షిణలో ఘర్షణ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఎడ్లబండ్ల ప్రదక్షిణలో భైరవునిబండ, రామాంజాపురం, బెండలపహాడ్ గ్రామాల భక్తుల మధ్య ఘర్షణ జరిగింది. ఆయా గ్రామాలకు చెందిన వ్యక్తులు కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో పలువురి కి గాయాలయ్యాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఐ ల య్య నేతృత్వంలో పోలీసులు సంఘటనా స్థలా ని కి చేరుకుని పరిస్థితి ఉధృతం కాకుండా చర్యలు తీసుకున్నారు.

### బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు

**నల్లగొండ:** పట్టణంలోని రవీంద్ర నగర్‌లో విజయ గణపతి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, మండపారాధన, శాస్త్ర కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం


కల్యాణంలో పాల్గొన్న కోమటిరెడ్డి లక్ష్మి

**మునుగోడు:** కొంపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వేడుకల్లో కోమటిరెడ్డి లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మేఘారెడ్డి, విజయ్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, మక్కెన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

**చిట్యాల:** వెలిమినేడు గ్రామంలోని సర్వే నంబర్ 132 లో గల తొమ్మిది ఎకరాల భూమిని గ్రామంలో ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సభ్యుడు కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

# పూలే విగ్రహానికి నివాళులర్పించిన కవిత


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

**నల్లగొండ టూటౌన్ :** భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం నల్ల గొండ పట్టణంలోని మున్సిపల్ పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, పెద్ద గడియారం సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవితకు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రీ ఘన స్వాగతం పలికారు.

**మాలె శరణ్యారెడ్డికి పరామర్శ**

అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాలె శరణ్యారెడ్డిని పానగల్ రోడ్‌లోని ఆమె నివాసంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. అదేవిధంగా హౌజింగ్‌బోర్డులో కవి వేణు సంకోజును పలకరించారు. ఆయన కవితకు పాలపిట్ట వేణునాదం పుస్తకాన్ని బహూకరించారు. అనంతరం బోయవాడలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి మహిళలతో ముచ్చటించారు. సింగం రామ్మోహన్–లక్ష్మి నివాసంలో కాసేపు గడిపారు.

### పండుగలను గౌరవించుకోవాలి


మాట్లాడుతున్న ఏఎస్పీ రాములునాయక్

**నల్లగొండ క్రైం :** ప్రతి పండుగను అందరూ గౌరవించుకుంటూ కుల మతాలకతీతంగా సోదర భావంతో ఉండాలని ఏఎస్పీ రాములునాయక్ పేర్కొన్నారు. సోమవారం నల్లగొండలోని ఓ పంక్షన్ హాల్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయవద్దని, అబద్ధాలను ప్రచారం చేయొద్దన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మసీదుల వద్ద భద్రతా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ దానియెల్, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రంజాన్ సందర్భంగా ప్రకాశం బజార్‌లో ఏర్పాటుచేసిన హలీస్ దుకాణం


ఖర్జూర పండ్లు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

# కనులపండువగా శివపార్వతుల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**నాంపల్లి:** శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ ఉమా నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన, శ్రీరామకోటి మహా యజ్ఞం, శివపార్వతుల కల్యాణం, ఊరేగింపు కార్యక్రమాలను ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. నాంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో శివపార్వతుల విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ సలహాదారుడు పూల వెంకటయ్య, ఆలయ చైర్మన్ పెద్దిరెడ్డి అనంతరెడ్డి, కన్వీనర్ పానగంటి వెంకటయ్య, వైస్ చైర్మన్ వీరమాళ్ళ నాగరాజు, దాతలు కుంభం విజయవర్ధన్ రెడ్డి, జయవర్ధన్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, కామిశెట్టి యాదయ్య, రమేష్, కర్నాటి విద్యాసాగర్, ఆంజనేయస్వామి, ఉప్పల సత్యనారాయణ, కుంభం మదన్‌గోపాల్‌రెడ్డి, వీరమళ్ల శ్వేతానాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష ప్యాడ్లు అందజేత

**కట్టంగూర్ :** ఈదులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు ఇతర సామగ్రిని లయన్స్ క్లబ్ నల్లగొండ అధ్యక్షుడు ఎల్‌వీ కుమార్ అందజేశారు. హెచ్ఎం వాణి, అంబటి అంజయ్య, కక్కిరేణి బద్రీనారాయణ, వెంకటరమణ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### ఎలక్టోరల్ బాండ్లను బహిర్గతం చేయాలి

**నల్లగొండటౌన్:** సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎలక్టోరల్‌బాండ్లను ఎస్‌బీఐ బహిర్గతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ. అబ్బాస్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గడియారం సెంటర్ వద్ద గల ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై ఎలక్టోరల్ బాండ్లను అడ్డగోలుగా తీసుకుని వేల కోట్ల రూపాయలు ఎన్నికల కోసం వాడుకుందని ఆరోపించారు. తుమ్మల వీరారెడ్డి, సీహెచ్.లక్ష్మీనారాయణ, సలీం, పి.నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, భిక్షం, కృష్ణారెడ్డి, వెంకన్న, సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రకుమార్, బ్రహ్మానంద రెడ్డి, నరేష్, పరిపూర్ణచారి, సైదులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**మర్రిగూడ:** మండలంలోని పలు గ్రామాల్లో 61 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, డీటీ తారకరామన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్ఐ బషీర్ అలీ, పాండురంగారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

**శాలిగౌరారం:** మండలంలోని ఆకారం గ్రామం నుంచి అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తున్న 46.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కట్టంగూరు మండలకేంద్రానికి గాదగోని సైదులు, గాదగోని జానకిరాములు సోమవారం మండలంలోని ఆకారంలో ఆ గ్రామానికి చెందిన శ్యామల నాగరాజు వద్ద 46.50 క్వింటాలు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఆ బియ్యాన్ని ట్రక్కులో తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ట్రక్కుతో పాటూ దానికి ఎస్కార్టుగా ఉపయోగించిన కారు, రూ.90 వేలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.